క్లుప్తంగా

భూగర్భ జలాలు సంరక్షించాలి

పలాస: ఉపాధి హామీ పథకంలో భాగంగా భూగర్భ జలాలను సంరక్షించాలని ఎంపీడీవో కె.వసంతకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై ఉపాధి, వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన, పశువైద్యశాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర భూగర్భ జలాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. మండల ప్రత్యేకాధికారి, పలాస పశువైద్య సహాయ సంచాలకుడు చంద్రశేఖరరావు అధికారులకు తగిన సూచనలు చేశారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శంకరరావు, వ్యవసాయ అధికారి పోలారావు, ఏపీడీ సీహెచ్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గానికి ధ్రువపత్రం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: సంతబొమ్మాళి మండల గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెండి మనోజ్‌కుమార్, కార్యదర్శిగా సోమిరెడ్డి వంశీ, కోశాధికారిగా బోర హేమావతితో పాటు మిగిలిన సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో జయంత్‌ప్రసాద్‌తో పాటు సిబ్బంది అభినందించారు.

ఉపకరణాలు పంపిణీ


ఉపకరణాలు అందజేస్తున్న అధికారులు

టెక్కలి: సంతబొమ్మాళి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు మంగళవారం ఉపకరణాలు అందజేశారు. టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జె.విలియమ్స్, ఎంఈవో జె.చిన్నవాడు ఆధ్వర్యంలో వివిధ రకాల ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కరరావు, గ్రామస్తులు ఎం.అప్పారావు, కె.కాంతారావు, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

కంచిలి: మండలంలోని కొండపోలేరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని గ్రామానికి చెందిన కప్ప హరికృష్ణ, రాములమ్మ దంపతులు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ఎంటీఎస్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి


విద్యార్థి, ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న దృశ్యం

కంచిలి: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి–1 ఎస్.శివరాంప్రసాద్ సూచించారు. మండల కేంద్రం కంచిలి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివిన బంగారు కోటేశ్వరరావు జవహర్ నవోదయకు ఎంపికవ్వడంతో హెచ్ఎం రెల్ల కామరాజు అధ్యర్యంలో మంగళవారం అభినందించారు. అలాగే సహకరించిన ఉపాధ్యాయుడు రవిని సన్మానించారు. అదేవిధంగా పాఠశాల పూర్వ హెచ్ఎం సాహుకారి సోమేశ్వరరావు విద్యార్థికి రూ.5 వేల నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లికి చెందిన ఢిల్లేశ్వరరావు 250 సారా ప్యాకెట్లను ద్విచక్ర వాహనంపై తీసుకొస్తుండగా జిల్లుండ గ్రామ జంక్షన్ వద్ద జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సోంపేట ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకొన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఢిల్లేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. ఇతడికి సారా సరఫరా చేసిన రాగుపురం గ్రామానికి చెందిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, సోంపేట మొబైల్ పార్టీ సీఐ జి.వి.రమణ, ఎస్ఐ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై దృష్టి

టెక్కలి: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం టెక్కలి ఎక్సైజ్ శాఖా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటుసారా కేసుల్లో ఇప్పటివరకు అరెస్టు కాని వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఎస్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎండుగడ్డికి గడ్డుకాలం

- వెంటాడుతున్న పశుగ్రాసం కొరత
- ఖరీఫ్ పంటలు పండకపోవడంతో ఇబ్బందులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు


నాటుబండ్లతో పశుగ్రాసాన్ని తరలిస్తున్న పాడి రైతులు


మేత మేస్తున్న మూగజీవాలు

వజ్రపుకొత్తూరు రూరల్: పశు పోషణలో వరి ఎండు గడ్డి అత్యంత కీలకం. ప్రత్యామ్నాయంగా మాత్రమే పచ్చగడ్డి, ఇతర ఆహారం తవుడు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు వంటివి వినియోగిస్తారు. పశువుల ఆకలి తీర్చేది ఎండు గడ్డి మాత్రమే. అయితే ప్రస్తుతం పలాస నియోజకవర్గంలో వరి ఎండుగడ్డికి పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఖరీఫ్‌లో వరి పంటలు చాలా వరకు ఎండిపోవడం ప్రధాన సమస్యగా మారింది. పంట నూర్పిడికి కూడా యంత్రాలను వినియోగించడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఫలితంగా ఎండుగడ్డి ధరలు మండిపోతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్, నాటుబండ్లతో వరిగడ్డిని కొలుగోలు చేస్తూ ఇళ్లకు తరలిస్తున్నారు. అయితే ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రవాణాతో కలిపి సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేలు వరకు ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూగజీవాలను అమ్ముకోవాల్సిన దుస్థితి

ఉద్దానం, పల్లపు, మెట్ట ప్రాంతాల్లో సుమారు 80 వేల మంది పాడి రైతులు దశాబ్దాలుగా పాడి పశువులను నమ్ముకొని జీవనాధారంగా బతుకుతున్నారు. అయితే నేడు ప్రభుత్వం నుంచి పశు పోషకులకు ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో మూగజీవాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. మూగజీవాల పోషణకు అవసరమైన పశుగ్రాసం పెంపకం, దాణా పంపిణీ చేయకపోవడంతో పాటు రైతులకు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో పాడి రైతులు అయోమయం చెందుతున్నారు. దిక్కతోచక సుదూర ప్రాంతాల నుంచి గడ్డిని కొనుగోలు చేస్తూ ఆర్థిక భారాన్ని అనుభవిస్తున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే పాడి సంపద క్షీణించే పరిస్థితి ఏర్పడుతోందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాడి రైతులను ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంటున్నారు.

పశుపోషణ భారమైంది



ఎండిగడ్డి కొరత కారణంగా పశుపోషణ భారంగా మారింది. స్థానికంగా గడ్డి లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్‌తో కొనుగోలు చేసి ఏడాదికి సరిపోయేలా నిల్వ పెట్టుకున్నాను. దాణా ఖర్చులు కూడా బాగా పెరిగాయి. పచ్చగడ్డి కూడా ఎక్కడా దొరకడం లేదు. పశువులను పోషించలేకపోతున్నాం.

– టి.మల్లేశ్వరరావు, పాడి రైతు, సీతాపురం

ఉచితంగా అందించాలి



పశుగ్రాసం కొరతతో ఆవులను పొలాల వైపు మేతకు విడిచిపెడుతూ చాలా ఇబ్బందులు పడుతున్నాం. పశు పోషణకు అవసరమైన దాణా అలాగే పచ్చగడ్డిని పెంచడానికి విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి. పాడి పశువులను నమ్ముకున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలి.

– టి.జ్యోతి, పాడి రైతు, వజ్రపుకొత్తూరు మండలం

సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి

- మంత్రి నిమ్మల రామానాయుడు


మదనగోపాల సాగరం మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

టెక్కలి: కూటమి ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడితో కలిసి టెక్కలి సమీపంలోని మదనగోపాల సాగరాన్ని మంగళవారం పరిశీలించారు. ముందుగా స్థానిక నాయకులు, అధికారులంతా మంత్రులకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. మదనగోపాల సాగరం రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి అనుకూలంగా ఉందన్నారు. దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే కాకుండా అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిధిలో ఉన్నటువంటి చెరువులను చైన్ ఆఫ్ ట్యాంక్స్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వంశధార ఎస్ఈ పి.వి.తిరుపతిరావు, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నేతాజీ

కవిటి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని వైస్ ఎంపీపీ పూడి నేతాజీ సూచించారు. మండలంలోని జగతి జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని హెచ్ఎం ఎంవీ రమణమూర్తి వివరించారు. దీనిలో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆద్యాంతం అలరించాయి

వృత్తి విద్య శిక్షణతో ప్రయోజనం


సోంపేట: విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఈవో శాంతికుమారి


ఇచ్ఛాపురం టౌన్: ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

ఇచ్ఛాపురం టౌన్: వృత్తి విద్యలో శిక్షణ పొందితే ఎంతో ప్రయోజనం ఉంటుందని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వనాథం, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: విద్యార్థులు వృత్తి విద్యపై ఆసక్తి చూపడం అభినందనీయమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినులు వృత్తి విద్య శిక్షణ పూర్తి చేసుకోవడంతో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో శాంతికుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన


పరిశీలన చేస్తున్న కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని అమీన్ సాహిబ్‌పేటలో తాగునీటి సరఫరాను మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ మంగళవారం పరిశీలించారు. రెండు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నా సరిపోకపోవడంతో, అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. పరిశీలనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మందస: స్థానిక ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని డీఈవో తిరుమల చైతన్య, ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడుల చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు సావిత్రిబాయి పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. విగ్రహదాతలు ఎ.అరుణశ్రీ, జి.మోహిని, జి.గంగాధర్‌రావు, ఎం.శివకేశవరావు, కె.శ్రీనివాసరావు, సిద్దాబత్తుల విజయలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో–1 ఎం.లక్ష్మణరావు, ఎంఈవో–2 ఎం.భాస్కరరావు, ఎస్.ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతామణి సంబరం


చింతామణి అమ్మవారి ఊరేగింపు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు కవిటి ఉద్దానం ప్రాంతీయుల ఆరాధ్య దైవం చింతామణి అమ్మవారికి సంబరం ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిరూపమైన గజముద్ద, కాళికా వేషధారణలు మేళతాళాలతో కవిటి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అనంతరం చింతామణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు.

అక్రమ కట్టడం తొలగింపు

కాశీబుగ్గ: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు నీలాపురం కాలనీలో అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. నీలాపురం కాలనీలో గ్రామకంఠం నందు ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాపారం నిమిత్తం దుకాణం పెట్టుకోవడానికి ఓ కుటుంబం నిర్మాణం చేపట్టింది. సదరు నిర్మాణానికి సంబంధించి స్థలానికి ఎటువంటి పట్టా లేకపోవడంతో పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కమిషనర్ నోటీసు ఇచ్చినా స్పందించలేదు. దీంతో మంగళవారం ఉదయం మున్సిపల్ జేసీబీతో అక్రమ నిర్మాణం తొలగించారు.

తప్పుడు ర్యాంకులతో మోసం


మాట్లాడుతున్న రవికుమార్

కాశీబుగ్గ: తప్పుడు ర్యాంకులతో కార్పొరేట్ కాలేజీలు విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవికుమార్ ఆరోపించారు. పలాస సీపీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జేఈఈ మెయిన్స్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు వారి కళాశాలలకు చెందిన వారిగా ప్రకటనలు ఇస్తున్నారన్నారు. ఒకే విద్యార్థి ఏకకాలంలో రెండు కళాశాలల్లో ఎలా చదువుతాడని ప్రశ్నించారు. దీనిపై విద్యాశాఖ మంత్రి స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సంఘ నాయకుడు పవన్‌కుమార్, జస్వంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదులపై విచారణ సరికాదు


ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రగిరికి మద్దతు తెలియజేస్తున్న వేతనదారులు

టెక్కలి: ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కక్ష సాధింపుగా ఫీల్డ్ అసిస్టెంట్‌పై తప్పుడు ఫిర్యాదులు చేయడం, దానికి అధికారులు విచారణకు రావడం సరికాదని టెక్కలి మండలం సీతాపురం పంచాయతీ వేతనదారులు ముక్తకంఠంతో వెల్లడించారు. పంచాయతీలో ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ బెండి చంద్రగిరి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఇదే గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కురుమోజు హరిబాబు అనే వ్యక్తి ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం ఏపీడీ శైలజ, ఏపీఓ హరిప్రసాద్ తదితరులు గ్రామంలో వేతనదారుల సమక్షంలో విచారణ చేశారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదంటూ సుమారు 100 మంది వేతనదారులు మద్దతు పలికారు. అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌కు అనుకూలంగా తీర్మాన పత్రాలను అధికారులకు అందజేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ బెండి చంద్రగిరిని తొలగించడానికి కక్ష సాధింపు చర్యలుగా జనసేన కార్యకర్త తప్పుడు ఫిర్యాదులు చేశాడంటూ కొంతమంది వేతనదారులు బాహాటంగా వెల్లడించారు. ఇటీవల ఇదే వ్యక్తికి జాబ్‌కార్డు అందజేసి మేట్‌గా అవకాశం కల్పించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. దీంతో వేతనదారుల నుంచి తీర్మాన పత్రాలను స్వీకరించిన అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని చెప్పి వెనుదిరిగారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



వజ్రపుకొత్తూరు రూరల్ మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్‌ను పూండి గల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి మూల ఉపేంద్రరావు మంగళవారం వితరణగా అందించారు. చదువుకున్న పాఠశాలకు సహకారం అందించడంపై పలువురు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.కేశవరావు, విద్యా కమిటీ చైర్మన్ బి.లక్ష్మీపతి, టి.కూర్మయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

వినూత్న ఆలోచన



ప్రైవేటు పాఠశాలలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలోని పాఠశాలలో 1వ తరగతిలో విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అయితే ఈ సమయంలో వారికి స్వాగతం చెబుతూ ఫస్ట్ డే ఆఫ్ స్కూల్, ఫస్ట్ క్లాస్‌కి స్వాగతం అని బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వినూత్న ఆలోచనను పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.గున్నయ్య ఉపాధ్యాయులు బాలక శంకరరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

– నందిగాం

ప్రకృతి వ్యవసాయంతో మేలు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ధనుంజయ

కంచిలి: ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతమై రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ అన్నారు. మండల కేంద్రం కంచిలిలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు వలన కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాదరావు వివరించారు. జిల్లా వ్యాప్తంగా సోంపేట డివిజన్ ఈ విషయంలో ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీర కామరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

కాశీబుగ్గ: జీడి పరిశ్రమలో పనిచేసే కార్మికుల వేతన ఒప్పందం పెంపు విషయమై ఏర్పాటు చేసిన సమావేశం మంగళవారం వాయిదా పడింది. జీడి పరిశ్రమల యజమానులకు, జీడి కార్మికులకు ప్రతీ రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పంద ఒడంబడిక జరుగుతుంది. రానున్న మే 15 నాటికి రెండేళ్లు పూర్తి కానుండడంతో ముందస్తుగా పరిశ్రమల యాజమాన్యానికి జీడి కార్మికుల సంఘం నుంచి రాతపూర్వకంగా విన్నవించారు. ఇదే విషయంపై పలాస కాష్యూ మాన్యుఫ్యాక్టర్ అసోసియేషన్ (పీసీఎంఏ) కార్యాలయంలో రైస్ మిల్లర్స్, కాష్యూ లేబర్ యూనియన్ నాయకులు, పీసీఎంఏ కార్యవర్గం చర్చలకు కూర్చున్నారు. పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, జీడి కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి పరస్పరం చర్చించినా విజయవంతం కాకపోవడంతో వాయిదా వేశారు. కార్యక్రమంలో పీసీఎంఏ కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, కార్యదర్శి మల్లా సంతోష్, కార్మిక సంఘ కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, గౌరవ అధ్యక్షుడు బొంపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అయ్యో పాపం..!


మృతుడి ఇంటి వద్ద గొడవ జరుగుతున్న దృశ్యం

కాశీబుగ్గ: బిడ్డలు పట్టించుకోకపోవడంతో ఎటువంటి ఆధారంలేక తండ్రి మరణించిన విషాదకర ఘటన పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పలాస పాతకోర్టు భవనం సమీపంలో స్థిర నివాసం ఉంటున్న కొంచాడ రామారావుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే వీరు కొన్ని సంవత్సరాలుగా ఆదరించకపోవడంతో పాటు వృద్ధాప్యానికి ఆకలి తోడవడంతో దిక్కులేకుండా మరణించారు. తండ్రి మరణించిన విషయం విజయవాడలో స్థిరపడిన కుమారుడుకి తెలియడంతో మంగళవారం ఉదయం విచ్చేశాడు. దీంతో అతడిని స్థానికులు అడ్డుకున్నారు. తండ్రి మరణానికి ఆదరణ లేకపోవడమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామే అంత్యక్రియలు చేసుకుంటామని మృతదేహాన్ని తాకవద్దని అతడికి హెచ్చరించారు. అయితే పలువురు నచ్చజెప్పడంతో తలకొరివిపెట్టడానికి అవకాశం కల్పించారు. తల్లిదండ్రులకు చూడని కుమారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేశారు.

• నేల తల్లిని రక్షించుకుందాం



ఇచ్ఛాపురం రూరల్: సేవ్ ఎర్త్ లోగోతో కొలిగాం పాఠశాలలో అవగాహన

సమస్త జీవరాశులకు ఆధారమైన నేలతల్లిని రక్షించుకుందామని పలువురు పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తంగా...

ఉపాధ్యాయుడికి స్వర్ణ పతకం

కంచిలి: మైసూరు దత్తపీఠంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత కంఠస్థం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మురపాల జగన్నాథరావు స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత మురపాల వల్లయ్య ప్రోత్సాహంతో భగవద్గీత శ్లోకాలను చిన్నప్పటి నుంచి నేర్చుకున్నానని తెలిపారు. అప్పట్లో తన తండ్రి తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఆధ్యాత్మిక ప్రచారకునిగా సేవలందించారు. ఈయనకు మే నెలలో పతకం అందజేయనున్నారు. ప్రస్తుతం కవిటి మండలం కొజ్జిరియా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నందిగాం: మండలంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న జి.దివ్య అండర్ –16 విభాగంలో జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌వో కె.జ్యోతి, పీఈటీ పి.ప్రశాంతిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం దుకాణం వద్ద గొడవ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఒక మద్యం దుకాణం వద్ద సోమవారం వివాదం చోటు చేసుకుంది. బీరు బాటిల్ కొనుగోలు చేసిన విషయంలో రూ.10ల లావాదేవీల్లో తేడా రావడంతో దుకాణ సిబ్బంది, కొనుగోలుదారుడు గొడవపడ్డారు. అనంతరం మద్యం దుకాణ యజమాని రావడంతో వివాదం సద్దుమణిగింది.

వినియోగించుకోవాలి

సోంపేట: పట్టణంలో ప్రారంభమైన బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు వినియోగించుకోవాలని జోనల్ మేనేజర్ రితేష్ కుమార్ సూచించారు. పట్టణంలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను డాక్టర్ యూనియన్స్ ప్రెసిడెంట్ సంపతిరావు రాజేంద్రప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖపట్నం రీజనల్ మేనేజర్ పీఎం ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంపిక

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కేడెన్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.

ప్రింటర్ వితరణ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కలర్ ప్రింటర్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాయి సూర్యనారాయణ, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ లత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఇచ్ఛాపురం టౌన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. మున్సిపాలిటీలోని బెల్లుపడలో జరుగుతున్న శ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞానికి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మిలు ఆయన ఆశీర్వాదం పొందారు.